# ఇంతే మగవాళ్లు

[ మగ పాత్రలు లేని నాటిక ]

**అదొక గది. అందులో మంచం, బట్టల స్టాండ్, అద్దం బల్ల వగైరా సంసారం సామాన్లు వుంటాయి. కుడి వైపున ఒకటి, ఎడమవైపున ఒకటి, ద్వారాలు, వుంటాయి.**

[కమల అద్దంముందు కూర్చుని తీరిగ్గా కూనిరాగాలు తీసుకుంటూ ముస్తాబు అవుతూ వుంటుంది. అత్త రాంభాణమ్మ వచ్చి కోడలి పిల్ల కులాసాకి విస్తుబోయి చూస్తుంది. కమల గబుక్కున కూనిరాగం ఆపేస్తుంది.]

రాంభా : (కోపంగా) ఆపేశా వేం? పాడుకో, నీకేమైనా పనా? పాటా? ఆఫీస్ నుంచి అబ్బాయి వచ్చేదాకా ఎంచక్కా పాడుకో.

కమల : (కొంచెం ఆలోచించి) ల... ల... లా (అని మళ్ళీ నిర్లక్ష్యంగా పాడుకుంటూ మేకప్‌కి తుది మెరుగులు దిద్దుతుంది.)

రాంభా : అవును. నిన్నని ఏం లాభం! నిన్నింత నెత్తికెక్కించుకోడం నాదే తప్పు.

కమల : నేనేం మీ నెత్తినెక్క లేదు!

రాంభా : ఇంక అదొక్కటి తక్కువైంది. గంగిరెద్దులా కూర్చుని కూనిరాగాలు తీసుకునే బదులు – ఈ ఇంటికి కోడల్ని కదా, ఇల్లూ అదీ చూసుకుని, వంటా గిట్రా చెయ్యాలి– అనే జ్ఞానం నీకేమైనా వుంటే కదా! ఎందుకూ వచ్చాయి పాతికేళ్లు. తాడిచెట్టుకొచ్చాయి నీకూ వచ్చాయి.

తంబు



కమల : అత్తగారూ! మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకండి.

రాంభా : నీతో నాకు మాటలెందుకే. వెళ్లు వెళ్లు పొయ్యిమీద పాలు పొంగిపోతున్నాయి.

కమల : పాలు పొంగిపోతే నేనే దించాలా? వంటింట్లోంచి వచ్చే ముందు దింపి రాకపోయారా?

రాంభా : నేను నీకు అత్తనా? నువ్వు నాకు అత్తవా? ఏమిటి నాకే పనులు పురమాయిస్తున్నావ్?

కమల : అవును మరి అత్తలంతా కోడళ్ళకి పనులు పురమాయించడానికే కాబోలు!

రాంభా : అవునే. మా అత్త నాచేత బండెడు చాకిరీ చేయించేది. నోరెత్తకుండా చచ్చినట్టు చేసేదాన్ని. అత్తనై నేనూ వున్నానిప్పుడు. ఏం లాభం? పాలు దింపి రావే అని నిన్ను అద్దం దగ్గర్నించి లేపలేక పోతున్నాను.

కమల : అత్తయ్యా. మీరెన్ని చెప్పండి. నేనివాళ వంటింట్లోకి ఛస్తే వెళ్ళను.

రాంభా : ఓసి నీయిల్లు బంగారం గానూ. మరీ అంత కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేస్తున్నావ్!

కమల : అవునత్తయ్యా. రోజూ నేనే చేస్తున్నానుగా వంట. ఇవాళొక్కరోజు మీరు చెయ్యాలి.

**పాత్రలు :**

- రాంభాణమ్మ
- కమల
- లక్ష్మి
- సుజాత
- శాంతమ్మ

అంతే. ఏమైనా సరే నేనివాళ వంట చెయ్యను.

రాంభా : ఇది మరీ విడ్డూరంగా వుంది. రోజూ నువ్వు చేస్తున్నావుటే వంట!?

కమల : నేను కాకపోతే మీరు చేస్తున్నారా? పొద్దున మీ పూజ పూర్తయ్యేసరికి పన్నెండు, తర్వాత మీరు చేసేది భోజనం. సాయంత్రం మీరు పురాణం నుంచి తిరిగి వచ్చి చేసేది నెయ్యి వెచ్చబెట్టడం. అంతేగా!

రాంభా : అయ్యో, రామా! శుభ్రంగా మడిగట్టుకుని పూజ చేసుకునే దాన్ని అలా వుండనిస్తావుటే! బాత్‌రూంలో దొరసానిలా స్నానంచేస్తూ – అత్తయ్యా పొయ్యి మీద కూర పాడి పోతుందేమో ఒక్కసారి చూడండి. అన్నట్టు ఆ పులుసులో బెల్లం ముక్క వెయ్యడం

మర్చిపోయా వేసేద్దురూ. అదేచేత్తో ఆ అన్నం అడుగంటి పోతుందేమో దింపేద్దురూ— అని నా ప్రాణంతీసి నా మడి మంట కలుపుతావు కదే! పైగా వంట నువ్వు చేస్తున్నావా?

కమల : పోనీ పొద్దుటి విషయం వదిలెయ్యండి. సాయంత్రం ఐదయ్యేసరికి హెడ్మాష్టారిలా తయారై బయల్దేరతారుగా పురాణానికి. మరి ఆ సంగతో!

రాంభా : అయినకాడికి కూరలన్నీ తరిగి, బియ్యం కడిగి పొయ్యి మీద పడేసి వెళ్తానుకదే రోజూ. నువ్వు పడిపోతున్న కష్ట మేమిటి నాకు తెలియక అడుగుతా!

కమల : అవును పాపం. ప్రొద్దున్న పూజచేసుకోనియ్యకుండా వంట—సాయంత్రం పురాణానికి వెళ్ళనియ్యకుండా వంట— పాపం ఎంత కష్టపడిపోతున్నారో!

రాంభా : అస్తమానం నా పూజ, పురాణంమీద పట్టిస్తావేం! నా పూజా పురాణం నువ్వు అద్దం ముందు కూర్చుని పాటలు పాడుకోడానికి అడ్డొస్తాయా?

కమల : అయితే నేనస్తమానం అద్దం ముందు కూర్చుని పాటలు పాడుకుంటున్నానా ?

రాంభా : అయితే నేనస్తమానం పూజలు చేసుకుని పురాణానికి వెళ్తున్నానా ?

కమల : కాకపోతే మీరు అస్తమానం వంట చేస్తున్నారా?

రాంభా : అయితే నువ్వు చేస్తున్నావా అస్తమానం వంట?

కమల : అవును నేనేచేస్తున్నాను.

రాంభా : నువ్వు మధ్య మధ్యలో చేసిన వంటే తినలేక ఛస్తున్నాం. మా ప్రాణాలకి అస్తమానం కూడా నువ్వే చెయ్యాలా వంట!

కమల : ఫరవాలేదు లెండి. మీ కంటే బాగానే చేస్తాను.

రాంభా : అందుకే కాబోలు మొన్న అరటికాయ కూర అంత అందంగా బొగ్గు అయి పోయింది.


కమల : మీలాగ పులుసులో ఉప్పు ఎక్కువ వెయ్యలేదుగా!

రాంభా : అవునే పులుసులో ఉప్పు ఎక్కువే వేశాను! వెయ్యడం మర్చిపోయా ననుకుని మళ్ళీవేశాను. ఏం చేస్తావు పెద్ద!!!

కమల : అహా! మొన్న అరటి కాయ ముక్కలు మీరు వేయిస్తున్నారేమో అనుకుని మాడిపోతూన్నా చూస్తూ వూరుకున్నాను. మీరు మహా ఏం చేస్తారు?

రాంభా : ఏం చేస్తానా ? నా





ఖర్మ అనుకుని నెత్తి [illegible]ని నోర్మూసుకుని వూరుకుంటాను.

కమల : మంచి పని! అలాగే చెయ్యండి.

రాంభా : చేస్తానమ్మా. చేస్తాను. మేనరికం వదులుకుని నిన్ను చేసుకున్నందుకు నాకు బాగానే బుద్ధి చెప్తున్నావు.

కమల : నన్ను పెళ్ళి చేసుకున్నది మీరు కాదు. మీ అబ్బాయి.

రాంభా : అవును. ఇదంతా వాడివల్లే వచ్చింది. ఆ చవట గాడిద నిన్ను చేసుకుంటానని ఏడవబట్టి ఈనాడు నాకు ఇలా గడ్డి పెడుతున్నావు.

కమల : నేను పెట్టడంలేదు. మీరే తింటున్నారు.

రాంభా : అవును నేనే తింటున్నాను. నాతోపాటు వాడికి కూడా కాస్త పెట్టు. ఎవడికి? మా వాడికి. నీ మొగుడికి. ఆ చవటకి, ఆ వెఱ్ఱి

వెధవకి, ఆ జబ్బి నాగమ్మకి—నిన్నే చేసుకుంటానని నాకు నిర్వాకం చేసిన ఆ చెపల వాజమ్మకి కూడా నిన్ను చేసుకున్నందుకు బాగా బుద్ధి వచ్చేటట్టు గంపెడు గడ్డిపెట్టు!

కమల: ఏమండోయ్ అత్తయ్యా! అనవసరంగా ఆయన్నెందుకు తిడతారు. నా సోరసలే మంచిదికాదు. ఆయన పూసెత్తకండి మధ్యలో.

రాంభా : నీ వాటం చూస్తే నోరేకాదు చెయ్యి కూడా చేసుకునేట్టున్నావ్! అయినా వాడినని ఏం లాభం! అంతా నా ఖర్మ!!!

కమల : అలా అన్నారుబావుంది. ఆయన్నిమాత్రం తిట్టకండి. నాకసలే చిరాగ్గా వుంది.

రాంభా : ఏమిటే? నన్ను బెదిరిస్తున్నావా? నాయిష్టం వచ్చినట్టు తిడతాను. నీ మొగుడు వట్టిచేతకాని వెధవ! పెళ్ళాంచేతిలో కీలుబొమ్మ!

కమల : అత్తయ్యా. మర్యాదగా ఆఖరుసారి చెప్తున్నా. మళ్ళీ ఆయన్ని తిడితే మాట దక్కదు.

రాంభా : అయితే నా కొడుకుని నేను తిట్టుకునే హక్కు నాకు లేదన్నమాట.

కమల : లేదు. ఆయన బాగోగులు చూసుకోడానికి తాళి కట్టిన పెళ్ళాన్ని నేనున్నాను. అనవసరంగా మీరు జోక్యం చేసుకోకండి.

రాంభా : ఇదంతా చూస్తుంటే వాడే నీకు పెళ్ళాంలా వున్నాడు.

కమల : ఏదోఒకటి. మీకెందుకు మధ్యలో.

రాంభా : ఔరా! కనిపెంచిన తల్లిని నాకంటే – నిన్నకాక మొన్న వచ్చిన పెళ్ళానివి నువ్వు ఎక్కువటే వాడికి.

కమల : అవును మీకంటే నేనే ఎక్కువ ఆయనకి. ఇప్పటికైనా తెల్సిందా ?

రాంభా : తెల్సిందమ్మా! వూరికే అనలేదు పెద్దలు – పెళ్ళాం అంటే బెల్లం, తల్లి తండ్రీ అల్లం– అని.

కమల : అనవసరంగా సినిమా పాటలు పాడకండి. వెళ్ళి వంట చెయ్యండి నాకు వేరే పనుంది.

రాంభా : అవునే. పెద్దలంటే భయం భక్తి, గౌరవం లేక పోయాక నేనేం చెప్పినా సినిమా పాటల్లా నే వుంటాయి మరి. ఈ కాలం పిల్లలు ఇంత బరితెగించబట్టే సంసారాలు సర్కస్ కంపెనీల్లా తయారౌతున్నాయి.

కమల : అత్తయ్యా! మాటలు జాగ్రత్తగా వాడండి. ఇది సర్కస్ కంపెనీ అయితే మీరు ఒక ఖడ్గ మృగం.

రాంభా : (నోరు నొక్కుకుని) ఓసి నీ అఘాయిత్యం కూలా! నన్ను ఖడ్గమృగం అంటావుటే!

కమల : నేను వేరే అనక్కర్లేదు.

రాంభా : అంటే?

కమల : అంతే!

రాంభా : మనిషంత మనిషిని. అందులోనూ అత్తగార్ని. పెద్దదాన్ని. నేనంటేనే ఖాతర్లేకుండా ఇంతలేసి మాటలంటున్న దానివి వాణ్ణి మటుకు ఏం సుఖపెడతావు?

కమల : ఆయన్ని మీరు సుఖపడనిస్తే చాలు. నేను వేరే సుఖపెట్టనవసరంలేదు.

రాంభా : హవ్వ. హవ్వ. నేను వాడి సుఖానికి అడ్డొస్తున్నానుటే!

కమల : కాకపోతే మరి. ఆర్నెల్లక్రితం ఆయన పాపం కొత్త రేడియో కొనుక్కుందామనుకుంటే మీరేగా కృష్ణా రామా అంటూ కొనిపించారు ఉత్తరదేశ యాత్రకి టిక్కట్టు – నూట ఎనభై రూపాయలు పెట్టి!

రాంభా : మూణ్ణెల్లపాటు నాబాధ వుండదని నువ్వేగా వాడిచేత ఆ టిక్కట్టు కొనిపించి నన్ను కాశీకి పంపించేశావు!

కమల : టిక్కట్టు ఎనభై, మీ పైఖర్చు డెభై అయితు, మీరు పారేసిన మరచెంబు వృథా అయిపోయినా మూడు నెలలూ వాన వెలిసినట్టు హాయిగా వుంది.

రాంభా : వాడు నాకు ఖర్చుపెడితే వృథా ? నువ్వూ వాడూ అప్పుడు మీ పిన్ని కూతురు పెళ్ళికి వెళ్ళి—అరవై రెండు రూపాయిల పట్టుచీర గొప్పగా చదివించి, పెళ్ళిలో ఒంటిపేట గొలుసు పారేసుకోడం దండగకాదు కాబోలు!

కమల : నా ఆయన సంపాదన నా యిష్టం వచ్చినట్టు తగలేస్తాను. మీకేం ?

రాంభా : నా కొడుకు మీద నీకెంత హక్కు [illegible]దో అంతకంటె నాకు ఎక్కువే వుంది. తెలుసునా ?

కమల : తెలియకేం! మీ పూజలకి, పునస్కారాలకి, దానాలకి, ధర్మాలకి అయ్యే దుబారా అంతా అందులోంచేగా !

రాంభా : నీ సినిమాలకి, సింగా

---

* లాయర్ కష్టపడి ఎలాగో తన క్లయింటయిన గజదొంగకి విముక్తి కల్గించాడు. వాడు కృతజ్ఞతతో "ప్లీడరుగారూ! ఎప్పుడేనా వచ్చి తమ దర్శనం చేసుకుంటాను" అన్నాడు.

ప్లీడరు : "బాబ్బాబు. నీకు పుణ్యముంటుంది. వీలు చేసుకొని పగలే రానాయనా."

# ఉత్తమ కళావైదగ్ధ్యంగల వస్త్రాలు

వివిధ వాంగుల్లో వివిధ రంగుల్లో
ఉత్తమ కళావైదగ్ధ్యంగల వస్త్రాలు
కమలపు పంటగ, ముత్యపుంతే మాచిపోగాయిలు
ప్రపంచమంతా ప్రశంసించిన వస్త్రాలు

— మందసౌర శాసనము 473 క్రీ.శ.



భారతదేశంలో వస్త్రాలని నేయడమంటే ఉత్తమ కళావైదగ్ధ్యంచేత ప్రతిబింబించేది అన్నట్లు నేయడమన్నమాట. ప్రపంచంలో మరెక్కడా చేనేత ఇల్లా ఒక సృజనాత్మక కళగా, ఇంత విస్తృత రంగంలో ప్రయోగించబడ లేదు.

ఈ సుసంపన్నమయిన సంప్రదాయము, చెప్పటి అతిం నేత పనివారి రక్తంలో జీర్ణించిన సంప్రదాయం, ఆధునిక వస్త్రాలంకరణకి అనుగుణమయిన ఆధునిక నమూనాలు, పద్ధతుల స్వీకరించి మరింత సంపన్నమయింది. ఈనాడు భారతదేశపు చేనేత వస్త్రాలు ఇదివరకెన్నడూ లేనంత అందంగా వున్నాయి, మరింత చక్కని నమూనాలలో, రంగులలో, రకాలలో లభిస్తున్నవి. వీనికి కొత్త ప్రయోజనమేర్పడి ప్రపంచమంతటా వాణిజ్య రంగాలలో ప్రవేశం పొందినవి. విరివిగా కోరబడుతున్నవి. గత సంవత్సరము చేనేత వస్త్రాల ఎగుమతి 14 కోట్ల రూపాయల విదేశీ మారక ధనాన్ని ఆర్జించింది.

అఖిల భారత
చేనేత
బోర్డు




రింపుకి వదిలేది ఎందులోంచో మరి !

కమల : అవును మొగుడి సంపాదనమీద పెళ్ళానికి హక్కు ఎలా వుంటుందీ ఇంట్లో. ఆయనేమో వుత్తి చంటిపాపాయి. తల్లిచాటు పిల్లాడు. అమ్మ చెప్తేనేగాని మీ అబ్బాయి ఏ పనీ చెయ్యరుగా— 'ఒరేయ్ మీ ఆవిడ దుబారా చేస్తోంద్రోయ్' అని చెప్పెయ్యండి.

రాంభా : అయినకాడికి వాడు జీతం అంతా తీసుకొచ్చి నీ చేతులోనే పోస్తున్నాడుగా. పెత్తనం అంతా నీదనేగా ఈ మెహర్బానీ. ఎందుకూ చేస్తున్నాడు వుద్యోగం. అదికూడా వదిలేసి నీకొంగు కట్టుకుని తిరిగితే సరిపోతుంది. పట్టిపెట్టు మారి మొగుడు !!!

కమల : లేకపోతే. అమ్మా అమ్మా అంటూ మీ వెనకతిరగాలా?

రాంభా : అక్ఖర్లేదు. నీ కొంగుకే ముడేసుకుని నీ వెనకే తిప్పుకో. వాడికి సిగ్గులేక పోయాక నిన్నని ఏం లాభం ?

కమల : ఛ. ఛ. ఏంమనుషులో.. భార్యా భర్తలు అన్యోన్యంగావుంటే చూసి ఓర్వలేరు.

రాంభా : అయ్యో ! అయ్యో ! అయ్యో ! ఎంతలేసి మాటలంటున్నావే ! మీ అన్యోన్యం చూసి ఓర్వలేనుకే ! ఏడీవాడు ? వాడ్ని రానియ్యి చెప్తాను. వ్యవహారం ఇంత వరకూ వచ్చాక ఇంక లాభం లేదు. నేనీ ఇంట్లో వుండడం ఇష్టంలేదేమో వాడినే అడిగేస్తాను.

కమల : ఆయన ఇప్పుడప్పుడే ఇంటికి రారు. ఇంటికి రాగానే మీ రేదో ఇలాంటి పంచాయితీ పెడతారనే!

రాంభా : అవునే. రోజూ నీతో దెబ్బలాట పెట్టుకుని, ఆ తగవు తీర్చమని వాడ్ని వేధించుకు తినడమే పని నాకు. వాడిని రానియ్యి. ఈ సంగతికూడా అడిగేస్తా.

కమల : ఆ... మీరిటువంటివన్నీ అడుగుతారని తెలిసే ఆయనఆరుగంటలయినా ఇంటికి రావడానికి భయపడి ఆఫీసులోనే వుండిపోతున్నారు.

రాంభా : ఏమో! నాకు భయపడి ఆఫీసులో వుండిపోతున్నాడో! నీకు భయపడి నీ చీర ఎంబ్రాయిడరీ దారాలూ, పూసలూ, అద్దం ముక్కలుకోసం బజార్న పడి తిరుగుతున్నాడో!

కమల : కాదు. మీరు చెప్పిన గంటల పంచాంగం తేవడానికే పోస్టుమేన్‌లా వూరంతా వెదుకుతూ వుంటారు.

(లక్ష్మి కుడివైపునుంచి కాలేజీ నుండి వచ్చి, పుస్తకాలు టేబిల్ మీదకి, గిరాటేసి, నీ ర సం గా నిట్టూర్చి, అటూ ఇటూ చూసి, కమలతో...)

లక్ష్మి: వ ది నా అ న్న య్యొ చ్చాడా ?

రాంభా: అ ప్పు డే ఎందుకు వస్తాడూ! రంగుచారాలింకా దొరికి వుండవు.

కమల : కాదు. గంటల వంచాం గం కోసం పక్క వూరు వెళ్ళుంటారు.

లక్ష్మి : అ బ్బ బ్బ ! అ ప్పు డే మొదలయ్యిందీ మీ యుద్ధం.అమ్మా కష్టపడి కాలేజీకి వెళ్ళొచ్చానుకదా రాగా నే కాస్త కాఫీ ఇవ్వకూడదే!

రాంభా : సిగ్గు లేకపోతే స రి. నేను కలిపి ఇవ్వాలా కాఫీ ? ఈ పాటికి పెళ్ళయి పిల్లల తల్లివి అవాల్సిన దానివి నీకు నేను కాఫీ కలిపి వియ్యపురాలిలాకూర్చోపెట్టి ఇవ్వాలి టే!

లక్ష్మి : అమ్మా ! వదిన మీద కోపం నామీద చూ పి స్తా వేం ? పోనీ వదినా, నువ్వైనా కాస్త కాఫీ కలిపి ఇద్దూ! కాలేజీనుంచి రాగా నే నీరసం వచ్చింది.

కమల : ఈ ఇంట్లో అ ం ద రి కీ నీరసాలే! ఎటొచ్చీ నేనే ఎద్దులా అంత చాకిరీ చెయ్యాల్సింది!

రాంభా : ఇ ప్పు డు వా డు రాగానే వాడ్ని తీసుకుని ఎక్కడికో షికారు వెళ్ళాలి కాబోలు – అందు కనే రోజూవచ్చే నీరసం పోయిం దివాళ.

కమల : షికారుకేమీ వెళ్ళడం లేదు. మా అక్కయ్య ఆడబడుచు తోటికోడలు మొగుడికి ఈ వూరు బదిలీ అయిందిట. వాళ్ళిల్లు ఆయ నకు తెలుసు. తీసుకువెళ్తానన్నారు అంతే!


రా ం భా : ఏ మో న మ్మా నాకదంతా తెలియదు. టౌనుహాల్లో రామాయణంకథ మీఎవరో మాట్లా డతారుటఇవాళ. ఎన్నిసార్లు వెళ్ళినా ఆ దిక్కుమాలిన టౌను హాలు నాకు గుర్తుండి చావదు. వాడొచ్చాక నన్నక్కడ దిగబెడతాడు. తర్వాత మీ ఇష్టం!

లక్ష్మి : అమ్మా .. వదినా ... మీ దెబ్బలాట మీదే కాని నాకు కాఫీ ఇచ్చేట్టులేరు మీరు. ఇప్పుడు అన్నయ్య వచ్చినా కాఫీ ఇచ్చే దిక్కులేదు.

రాంభా : దానికంత బాధ్యత తెలియకపోయినా నేను వున్నా నుగా కలిపి ఇస్తాలే కాఫీ!

కమల : మీరేం కష్టపడనక్కర్లేదు. కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి వుంచాను లెండి.






లక్ష్మి : హమ్మయ్య! బతికిం చావ్! ఏదీ కాఫీ?

రాంభా : గ్లాసులో పోసుకుని తెచ్చుకుని తాగగలవా ? పడుకో పెట్టి పట్టాలా ?

లక్ష్మి : నేవెళ్ళి తెచ్చుకోగలను. కానీ నే వె ళ్ళ గా నే మీరు మళ్ళీ యుద్ధం ప్రారంభిస్తారు.

కమల : పోన్లే. నేను తెచ్చిపెడ తాను.

(అనికమలఎడమవైపు వెళ్తుంది.)

రాంభా : (ఎ డ మ గ ది కే సి చూస్తూ) ఒసే అమ్మడూ. వాడ్ని వుత్త అమాయకుడ్ని చేసి మనల్నం దర్నీ ఎలా ఆడిస్తోందో చూశావా?

లక్ష్మి : అమ్మా నీకు వేరే పనేమీ లేదేమిటే ?

రాంభా : ఏ ం అ లా అ డు గు తున్నావ్.

లక్ష్మి : అబ్బే ఏం లేదు. నీ పురాణం ఎన్నింటికి?

రాంభా : ఇవాళ పురాణానికి వెళ్ళను. టౌను హాల్లో రామాయణా నికి వెళ్ళాలి. అబ్బాయివస్తే బావుం డును దిగ బెడతాడు.

లక్ష్మి : అవును అన్నయ్యవస్తే బావుండున్ను.

(కమల ఎడమ ద్వారంలోంచి కా ఫీ గ్లా సు తో వ చ్చి లక్ష్మికి ఇస్తుంది.)

కమల : ఎవరూ రావడం? మీ అన్నయ్యేనా. ఆయనింత పెంద్రాళే వస్తే ఇంకేం?

రాంభా : వాడు వచ్చేసరికి ఆ రామాయణం కాస్తా అయ్యేపోతుంది. ఎప్పుడొస్తాడో! ఎప్పుడు దిగపెడతాడో!

కమల : అత్తయ్యా! మీ రామాయణంకంటే ముందు నేను మా వాళ్ళ యింటికి వెళ్ళాలి. గంటనించీ నేను రెడీగా చూస్తున్నా ఆయనకోసం.

రాంభా : వాడ్ని రానియ్, వాడే ఆలోచించుకుంటాడు. నన్ను దిగపెట్టాలో, నిన్ను తీసుకు వెళ్ళాలో.

లక్ష్మి : ఈ పరిస్థితిలో అన్నయ్య వచ్చి ఇరుకులో పడే బదులు ఇంకేదైనా పని చూసుకుని ఆలశ్యంగా వస్తే మంచిది.

కమల : నువ్వు తీరిగ్గా కూర్చుని కాఫీ తాగుతున్నావుగా ఆయన ఎంత అలసిపోతే నీకేం?

రాంభా : అప్పటికి వాడు రాగానే నువ్వు వాడ్ని విశ్రాంతి తీసుకోమంటావు కాబోలు.

కమల : నే వూరుకున్నా మీరూ మీ రామాయణం వున్నాయిగా!

లక్ష్మి : మిమ్మల్ని చూశాక, అన్నయ్య వచ్చినా నా పని చెప్పడానికి భయం వేస్తోంది.

రాంభా ; ఏం? నీకూ ఏమైనా రాచకార్యం చేసిపెట్టాల్నా వాడు?

కమల : అయితే అయినట్టే ఇంక.

లక్ష్మి : అదికాదమ్మా. ఇవాళ రాత్రి మా స్నేహితురాలికి బెజవాడలో పెళ్ళి. అన్నయ్య వస్తే టెలిగ్రాం ఇమ్మనాలి.

రాంభా : శుభమా అని పెళ్ళి చేసుకుంటూంటే టెలిగ్రాం ఎందుకే?

లక్ష్మి : నీకు తెలియదులేవే పెళ్ళికి వేరే టెలిగ్రాంలు ఇస్తారు.

రాంభా : ఏమోనమ్మా టెలిగ్రాం అంటేనే నాకు భయం.

కమల : అత్తయ్యా మీకుకూడా భయం అనేది వుంటుందా? మిమ్మల్ని చూస్తేనే అందరికీ భయం వెయ్యాలికాని–

రాంభా : ఏమే? నేనేం దెయ్యాన్నా? భూతాన్నా? నీ నోటికి మరీ అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. వాడ్ని రానియ్ చెప్తా.

కమల : రానియ్యండి. నేనూ చెప్తాను. లేకపోతే రోజూ ఏమిటీ భాగోతం. ఏదో ఒకటి తేలిపోవాలి ఇవాళ.



లక్ష్మి : అమ్మతో సమానంగా నువ్వూ దెబ్బలాడితే ఎలా వదినా? ఏదో పెద్దరికం! చాదస్తంకొద్దీ ఏదో అంటే దాన్ని పట్టుకుని నువ్వుకూడా ఏమిటి వదినా?

రాంభా : అంటే నేనే మొదలు పెట్టానన్నమాట ఇదంతా!

కమల : మీరు కాదు నేనే మొదలు పెట్టాను. ఏదో పోనీ లెమ్మని సర్దుకుపోతూంటే మీరు..

రాంభా : ఏం? ఆపేశావేం? ఆ అనదల్చుకున్నదేదో అనెయ్!

లక్ష్మి : అమ్మా నువ్వూర్కో. ఎందుకి కీచులాట అనవసరంగా.

రాంభా : అవునే. నేనే అనవసరంగా కోడలితో కయ్యానికి దిగుతున్నాను. నువ్వుకూడా ఒక కోడలికి అత్తవై, ఆ కోడలు నిన్ను నిర్లక్ష్యం చేస్తే అప్పుడు తెలుస్తుంది.

కమల : కాదులక్ష్మి. నీక్కూడా పెళ్ళయి ఇటువంటి గయ్యాళి అత్తగారు వస్తే నా కష్టం తెలుస్తుంది.

రాంభా : మధ్యలో దాన్నెందుకూ దీవిస్తావు గయ్యాళి అత్తగారొస్తాలని? దాన్ని మా బుజ్జిగాడికే ఇచ్చి పెళ్ళి చేస్తాం. వాడికి ఇదెంత చెప్తే అంతే! నెత్తిమీద పెట్టుకుని పూజ చేస్తాడు. అత్తగారి ఆటలు దాని దగ్గర సాగవు.

కమల : కాబోయే అల్లుడు మీ కూతురి మాట జవదాటకూడదని మీరు అనుకుంటున్నప్పుడు మీ కొడుకు కోడలిమాట వినేస్తున్నాడని ఎందుకూ ఏడవడం?

రాంభా : అవునే ఏడుస్తాను. నీకేం. నాయిష్టం.

లక్ష్మి : అమ్మా వూరుకోవే. ఏమిటి వదినతో సమానంగా...

రాంభా : నువ్వు వాడికి చెల్లెలివే అన్పించుకుంటున్నావే వెర్రితల్లీ! వాడు నీకోసం తెచ్చిన వంగపండురంగు గళ్ళ చీర అది పుచ్చేసుకున్నా నీకు తెలియదు.

కమల : ఆహా! మరి అటువంటి

---

● "ఏం, దిగులుగా వున్నావ్?"

"మా ఆవిడ పుట్టింటికెళ్ళి రెండు నెలైంది. ప్రతి వుత్తరంలోను నేను రాత్రిళ్లు ఎక్కడికీ వెళ్ళటంలేదని, ఇంట్లోనే వుండి రాత్రి రెండింటిదాకా నిద్ర పట్టక పుస్తకాలూ అవీ చదువుకుంటూ కాలక్షేపం చేస్తున్నానని రాసేవాణ్ణి. రేపావిడ వస్తోంది."

"వస్తే ఏం?"

"ఏమి కేమిటోయ్ భగవాన్లూ. నిన్నొచ్చిన కరెంటు బిల్లులో రెండునెల్లకీ కలిపి ముప్పావలా అయింది."

చీరె ఇంకొటి తెమ్మని ఆయన మీ చేతి కిచ్చిన పాతిక రూపాయలూ మీరు ఆ మధ్య వచ్చిన దొంగ సన్యాసికి కైంకర్యం చేసినా తెలియదు పాపం.

లక్ష్మి : వదినా ఒక్కక్షణం ఆగు. అమ్మా నువ్వు కూడా కొంచెం ఓపిక పట్టు. ఆ......


ఐటెక్స్ సౌందర్యానికి సహాయకారులు



● ఐటెక్స్ కాటుక పసిపిల్లలకు కూడా చాలా మంచిది.

● ఐటెక్స్ బిందీ కంటికింపైన రంగులలో లభించును.

● ఐటెక్స్ కుంకుం పేస్టు.

అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 — మద్రాసు—17.


మీ రిద్దరూ ఇలాగ ఆగకుండా ఎన్ని రోజులు దెబ్బలాడుకో గలరు?

రాంభా : ఏం? మాకు ఓపిక వున్నంతవరకూ దెబ్బలాడు కుంటాం.

కమల : నీ కంత కష్టంగా వుంటే వెళ్ళి కాలేజీలోనే కూర్చో.

లక్ష్మి : అన్నయ్య ప్రస్తుతం చేస్తూన్న పనే అది. ఇంటి దగ్గర మీ కాకిగోల భరించలేకనే ఆలశ్యంగా వస్తున్నాడీ మధ్య.

రాంభా : మా కాకిగోల భరించలేక వాడేమీ కష్టపడి పోడం లేదు. క్లబ్బులో కూర్చుని ఖుషీగా పేకాట ఆడుతూ వుంటాడు.

కమల : ఆయనకి క్లబ్బుకి వెళ్ళడానికి తీరిక ఎక్కడుంటుంది పాపం. ఆఫీసులో ఆ బీద లేడీ టైపిస్టుని చూసి జాలిపడడం తోటే సరి పోతుంది.

లక్ష్మి : ఛ ఛ రాను రాను మీరంటే నాకు అసహ్యం వేస్తోంది. ఎందుకూ తీరికూర్చుని అర్థంలేని అపోహలు చేస్తారు? అన్నయ్య క్లబ్బులో కూర్చుని పేకాట ఆడడం నువ్వు చూశావా అమ్మా, లేకపోతే ఆఫీస్‌లో ఆ లేడీ టైపిస్టుతో వదిన చూసిందా? ఎందుకు అనవసరంగా కన్నకొడుకుమీద, కట్టుకున్న మొగుడిమీద అభాండాలు వేస్తారు?



రాంభా : అవును అభాండాలే! ఏం? వేళపట్టున ఇంటికి రాక వాడక్కడ చేసే రాచకార్యం ఏమిటో?

కమల : కళ్ళు కాయలుకాచేటట్టు ఎదురుచూడ్డమేకాని ఒక్క రోజైనా ఆయన త్వరగా ఇంటికి వచ్చారా?

లక్ష్మి : అవును. అన్నయ్యదే తప్పంతా! ఇంటికి రోజంతా ఆలస్యంగా రావడం అన్నయ్యదే తప్పు. మిమ్మల్నిద్దర్నీ ఇలా విచ్చలవిడిగా నోటికి వచ్చినట్టు వాగనియ్యడం అన్నయ్యదే తప్పు. మీ తప్పేమీ లేదు.

కమల : ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తూంటే టైమ్‌కిరాపోతే ఏమను కోవాలి?

రాంభా : లక్షా తొంభై అనుకుంటారు. మనం ఎన్ననుకున్నా వాడికేం! మగమహారాజు! వూరంతా వూరేగి ఎప్పుడో చేరుకుంటాడు ఇంటికి. వాడికిప్పుడు మనం జ్ఞాపకం వుంటామా? ఇంటి దగ్గర మనం వాడి కోసం ఇలా కాపలా కాస్తూంటామని వాడికేం తెల్సుపాపం!

కమల : లక్ష్మి నీకూ పెళ్ళయితే తెలుస్తుంది. మొగుడు వేళకి ఇంటికి రాకుండా షికార్లు కొడితే ఎలా వుంటుందో? ఏమనిపిస్తుందో? ఇంతే మగవాళ్ళు! బాధ్యత తెలియదు.

లక్ష్మి : అవును. మగాళ్ళకి స్వేచ్ఛ ఎక్కువ. వాళ్ళేం చేసినా అడిగేవాళ్ళు లేరు. అన్నిటికీ సర్దుకు పోవాల్సింది మన ఆడవాళ్ళే.

రాంభా : అంతేనే! తరతరాల్నుంచి, యుగయుగాల్నుంచీ మన ఆడవాళ్ళకి ఇలాగే అన్యాయం జరుగుతోంది అయినా మనం ఏమీ చెయ్యలేం!

కమల : ఆడది ఎంత చదువు చదివి, ఏం ఉద్యోగం చేసినా పెళ్ళాం పెళ్ళామే! మొగుడు మొగుడే! ఆడది ఆడదే! మొగాడు మొగాడే!

లక్ష్మి : ఇంతే మగవాళ్ళు— అని మనం నోరు మూసుకుని వూరుకోవల్సిందేనా? మహిళల్లో విప్లవం తీసుకొచ్చి మగవాళ్ళకి బుద్ధి చెప్పలేమా?

రాంభా : చాల్చాలు ...... నోర్ముయ్... ఎవరేనా వింటే నవ్వి పోతారు.

కమల : తిరుగుబాటు అనేది జరగని పని లక్ష్మి. మనలో ఐకమత్యం లేదు.

లక్ష్మి : మగవాళ్ళ అహంకారానికి ఆనకట్టు కట్టాలి. వనితలంతా కలిసి వుద్యమం లేవదియ్యాలి. ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు. ముందు అన్నయ్యతో ప్రారంభిద్దాం.

వృద్ధిగావింపబడిన కొత్త సన్‌లైట్ వల్ల ప్రతిమాటూ

మీ బట్టలు అతికాంతిగా ఉతుకబడును




లింటాస్. S. 60-77 TE

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి




రాంభా : ఒసే, కొంపదీసి నీకు పైత్యం చెయ్యలేదు కదా !

కమల : లక్ష్మికి కాదు పైత్యం చేసింది. మొత్తం మగవాళ్ళందరికీ పైత్యం చేసింది.

రాంభా : పిచ్చి కుదిరింది రోకలి తీసుకురా తలకి చుడతాను అన్నాట్ట వెనకటికి ఎవరో! అలాగ మీకు మతి లేకపోతే సరి. పిచ్చి వాగుడు కట్టిపెట్టండి.

(సుజాత కుడివైపులోంచి 'లక్ష్మీ' అని పిలుస్తూ ఆదుర్దాగా ప్రవేశిస్తుంది.)

లక్ష్మి : ఏమిటి సుజాతా హడావుడి!

సుజా : లక్ష్మి మీ అన్నయ్య ...

లక్ష్మి : ఇంకా ఆఫీస్ నుంచి రాలేదు.

కమల : ఎప్పుడొస్తారా అనే ఎదురుచూస్తున్నాం.

రాంభా : రాగానే కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలి కూడా!

సుజా : కాదు లక్ష్మి మీ అన్నయ్యకి ...

లక్ష్మి : వూ ... ... మా అన్నయ్యకి ... ఏమైనా కబురుచెప్పాలా?

సుజా : కాదే! మీ ... అన్నయ్యకి ... అన్నయ్యకి ఏక్సిడెంట్ అయింది.

రాంభా : హా! ఏక్సిడెంటే.

లక్ష్మి : అన్నయ్యకి ఏక్సిడెంటయిందా?

కమల : అయ్యో! ఏంజరిగిందో? ఎలా వున్నారో!

సుజా : ఏం భయంలేదు లేడి. ఆయనకేం పెద్ద దెబ్బలు తగల్లేదు.

రాంభా : హమ్మయ్య బతికించావ్. ఏక్సిడెంటనగానే నా పై ప్రాణం పైనే పోయింది. ఆ శ్రీరామచంద్రమూర్తి చల్లగా చూశాడు అంతేచాలు.

లక్ష్మి : ఇంతకీ అన్నయ్య ఏడీ?

కమల : ఆయన ఎక్కడున్నారు?

సుజా : హాస్పటల్లో వున్నారు.

రాంభా : దెబ్బలుతగల్లేదన్నావు మళ్ళీ హాస్పటల్ అంటావు? అసలు జరిగిందేమిటో సరిగ్గా చెప్పు.

సుజా : మీ అబ్బాయి మెయిన్ రోడ్డులో అటుంచి ఇటు రోడ్డు దాటుతూండగా ఒక సైకిల్ రిక్షా వచ్చి గుద్దేసింది. మీ అబ్బాయి కేమీ అంత దెబ్బలు తగల్లేదు కానీ ఆ రిక్షా వాడికి బాగా దెబ్బలు తగిలాయి.

రాంభా : అవును మరి. వళ్ళు పయి తెలియకుండా రిక్షా తొక్కితే దెబ్బలు తగలవూ !

లక్ష్మి : పాపం వాడికి పెద్ద దెబ్బలు తగిలాయా ?

కమల : రిక్షావాడి సంగతి ఎందుకు ? ఇంతకీ ఆయనేరి ?

సుజా : వాడికి మందు వేయించడానికి హాస్పటల్‌కి తీసుకువెళ్ళారు.

లక్ష్మి : పోనీలే మనందరి అదృష్టం బావుండి అన్నయ్య క్షేమంగా వున్నాడు. అంతేచాలు.

రాంభా : అంతా ఆ ఏడుకొండల వాడి చలవ. ఆ వెంకటరమణ మూర్తి పేరు పెట్టబట్టి గండం గడిచింది.

కమల : అంత ప్రమాదం తప్పిందికదా ఆయన తిన్నగా ఇంటికి వచ్చేస్తే మన ప్రాణాలు ఎంత కుదుట పడతాయి.

సుజా : ఇంటికి వచ్చేద్దురు. కానీ—ఆ రిక్షావాడ్ని అలా వదిలెయ్యడానికి మనసొప్పక హాస్పటల్‌కి తీసుకు వెళ్ళారు. నేను సంగీతం మాష్టారి ఇంటినుండి తిరిగి వస్తూంటే ఈ ఖబురు ఇంట్లో చెప్పమన్నారు. అరగంటలో వచ్చేస్తాను, ఖంగారు పడొద్దన్నారు.

రాంభా : మంచిదమ్మా. ఏదో కబురు చెప్పావు. లేకపోతే వాడింకా రాలేదు, ఏమయ్యాడా అని తికమకపడి చచ్చేవాళ్ళం.

సుజా : నే వెళ్ళొస్తా లక్ష్మి ఇటువంటి కబురు మోసుకు వచ్చినందుకు ఏమీ అనుకోకు.

లక్ష్మి : ఛ ఛ నీ తప్పేం వుంది మధ్యలో. పెద్ద ప్రమాదమేమీ జరిగి పోలేదుగా.

కమల : అయినా ఇటువంటి కబురు ఇంకెప్పుడూ తీసుకు రాకమ్మా ...... వుత్తినే అన్నాను. ఏమీ అనుకోకు వెళ్ళిరా...

(సుజాత కుడివైపునుంచి వెళ్ళి పోతుంది.)

రాంభా : ఆ దిక్కుమాలిన రిక్షా వాడికి కట్టు కట్టించడం ఇంకా పూర్తయి వుండదా?

కమల : అక్కడ అందమైన నర్సులు వాడికి కట్లు కడుతూంటే పాపం ఆయనవాళ్ళకి సాయపడుతూ వుండి వుంటారు.

లక్ష్మి : మళ్ళీ మొదలుపెట్టారా మీ ఊహాగానం. వాడికి మందు వేయించి ఈపాటికి అరగంట అయి వుంటుంది.

రాంభా : అయితే మళ్ళీ క్లబ్బుకి వెళ్ళి పేకాట ఆడుకుంటున్నాడేమో.

కమల : కాదు. ఆఫీస్‌కి వెళ్ళి ఆ బీద లేడీ టైపిస్టుని చూసి జాలి పడుతూ వుంటారు.

లక్ష్మి : మీరు నోరు వూరుకోక అలా అనుకుంటున్నారు. అన్నయ్య వచ్చేస్తూనే వుంటాడు.

రాంభా : ఆ వస్తూనే వుంటాడు. ఆ రంగు దారాలూ, పూసలూ,






అద్దాలూ ఎక్కడున్నాయో కనుక్కుంటూ.

కమల : గంటల పంచాంగం ఎక్కడుందో వెదుక్కుంటూ.

లక్ష్మి : అబ్బబ్బ. మళ్ళీ మొదలయ్యింది మీ యుద్ధం, అన్నయ్య వచ్చేలోగా మళ్ళీ అంతా ప్రారంభం.

కమల : ఆయన తిర్గ్గా వస్తూనే వుంటారు. మాకే వేరే పని లేక పోట్లాడు కుంటున్నాం. మొత్తానికి ఆయన మగబుద్ధి ఎక్కడికి పోతుంది.

రాంభా : వేళకి తిన్నగా ఇంటికి వచ్చే ఖర్మ వాడికేం పట్టింది. వాడికేం మగ మహారాజు!

లక్ష్మి : అవును. ఇంతే మగవాళ్ళు! అన్నయ్య ఎప్పుడొస్తాడో కాని నేను మాత్రం మీ డ్యూయెట్లు వినలేను. పక్కింటి శాంతమ్మ పిన్నిగారింటికి వెళ్తున్నా. అన్నయ్య రాగానే పిలవండి.

(లక్ష్మి కుడి వేపు గదిలోకి వెళ్తుండగా శాంతమ్మగారు కుడి వేపు గదిలోంచి ప్రవేశించి లక్ష్మికి ఎదురౌతారు).

శాంతమ్మ : మా ఇంటికెందుకు లక్ష్మీ. అక్కడికి కూడా ఈ హరికథే వినిపిస్తోంది. మా ఇంటికేకాదు మన వీధి మొత్తానికే విన్పిస్తోంది మీ ఇంట్లో హడావుడి!

లక్ష్మి : అమ్మా, విన్నావా? వదినా! ఇప్పటికైనా తెల్సిందా?

మన ఇల్లు ఎంత ఆదర్శ ప్రాయంగా తయారవుతోందో!

కమల : అవును ఇరుగుపొరుగుకి వేరే పనిలేకపోతే సరి, మనమాటలే విన్పిస్తాయి.

రాంభా : కమలా, ఇష్టం వచ్చినట్టు పెద్దా చిన్నా లేకుండా ఏమిటా మాటలు ?

కమల : ఇందాకట్నించి పెంకులెగిరి పోయేట్టు దెబ్బలాడి ఇప్పుడు బుద్ధులన్నీ నాకు చెప్తారేం ?

రాంభా : దాని మాటలకేంగాని, రండి. పిన్నిగారూ, కుర్చోండి.

శాంతమ్మ : మీ కుటుంబ విషయంలో నేను జోక్యం కలుగచేసుకోకూడదు కానీ మీ కుటుంబం మీద వున్న అభిమానంకొద్దీ, మీ దగ్గరవున్న చనువుకొద్దీ ఒక విషయం చెప్దామని వచ్చాను పిన్నిగారూ.

రాంభా : చెప్పండి పిన్నిగారూ !... అంతకంటేనా ...

శాంత : ఎందుకు రోజూ సాయింత్రం మీ ఇంట్లో హోరాహోరి యుద్ధం జరుగుతుంది ?

కమల : ఎందుకా ! ఆ మధ్య మీ ఇంట్లో మీరూ, మీ కోడలూ కలిసి మీ అబ్బాయి ఆఫీస్‌నుండి ఆలస్యంగా ఎందుకు వస్తున్నాడని నూ ఇదయి పోయేవారు చూడండి. అందుకని !

లక్ష్మి : ఏమిటి వదినా మరీ మర్యాద లేకుండా.

కమల : నీకు తెలియదు లక్ష్మి. నాకు అసలే వళ్ళు మండిపోతోంది.

లక్ష్మి : నీకే కాదు; ఈ మగ వాళ్ళ నిర్లక్ష్యం, పొగరుమోత్తనం తల్చుకుంటే అందరికీ వళ్ళు మండుతుంది.

శాంతమ్మ : అయితే ఇది మగవాళ్ళ నిర్లక్ష్యం, పొగరుమోత్తనం అంటావు?

రాంభా : ... పిన్నిగారూ ... దేవుడే వాళ్ళకి ఆధిక్యం ఇచ్చాడని మగాళ్ళందరికీ పెద్ద బడాయిలెండి. మీకు తెలియని దేముంది లెండి, పిన్నిగారూ.

శాంతమ్మ : సృష్టిలో ఆధిక్యం ఎవరిదీ కాదు. అందరూ సమానమే. ఆడ-మగలో ఎవరు గొప్ప అనే ప్రసక్తి వస్తే పురుషుడికంటే స్త్రీయే గొప్పదని చెప్పవచ్చు. పురుషుణ్ణి కన్నతల్లిగా, స్వంత సోదరిలా, ఇల్లాలిగా ఆదరించి ప్రేమిస్తుంది స్త్రీ.

కమల : అవును. అందుకనే ఈ మగాళ్ళంతా అలా నెత్తికెక్కి కూర్చున్నారు.

లక్ష్మి : పురుషులతో సమాన హక్కులు సాధించి వాళ్ళతో సమానంగా వుద్యోగాలు చేస్తూన్న ఈ రోజుల్లో కూడా స్త్రీలు ఇంకా ఇలా బానిసల్లా పడి వుండడం అన్యాయం.

రాంభా : మనల్ని కేవలం వంటింటి కోసం, పిల్లల్ని కనడం కోసమే సృష్టించాడు దేవుడు.

శాంతమ్మ : అలా అని మనల్ని మనమే లోకువ చేసుకుంటున్నాం. ఎంతటి పురుషుడికైనా మొదటి గురువు స్త్రీయే! పసిపాపగా ఎవరైనా మొదట నేర్చుకునే మాట – అమ్మ ! అందుకే ఇంటికి దీపం ఇల్లాలే అన్నారు

కమల : ఇంత ప్రాధాన్యం వున్న స్త్రీకి నిజంగా కోపంవస్తే ఈ మగాళ్ళంతా ఒక్కరోజులో సన్యాసులయిపోతారు.

లక్ష్మి : అందుకనే మహిళంతా వుద్యమం లేవదీసి మనవిలువ మగవాళ్ళు గుర్తించేటట్టు చెయ్యాలి.

రాంభా : మగ – ఆడలో ఎవరు గొప్ప అనేది ఎప్పటికీ తెమలని సమస్య. ఎటొచ్చీ ఒకళ్ళ విలువ ఒకళ్ళు తెలుసుకుని ఎవరి బాధ్యతలు వాళ్ళు గుర్తిస్తేచాలు !

శాంత : మంచి మాటన్నారు పిన్నిగారూ... సంసారమనే బండి సాఫీగా సాగిపోవాలంటే ఒకళ్ళను, ఒకళ్ళు లాగకుండా ఇద్దరూ కలిసి తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే చాలు. ఈ సత్యం గ్రహించక పూర్వం నేను మా కోడలు, మా అమ్మాయి మీలాగే మగవాళ్ళని ఆడిపోసుకుంటూ మాలో మేము కీచులాడుకుంటూ వుండేవాళ్ళం. కానీ ఇప్పుడు మా ఇల్లు నమూనా స్వర్గసీమలా హాయిగా వుంది.

రాంభా : ఇది అందరికీ తెలిసిన సత్యమే !. మీరు ఆచరణలో పెట్టారు. సుఖంగా వున్నారు. మేం కూడా ఇవాల్టినుండి ఆచరణలో పెడతాం.

కమల : అవును. వారు రాగానే కూర్చోపెట్టి వారి బాధ్యతలు వారికి, మన బాధ్యతలు మనకి వప్పగించుకుందాం.

లక్ష్మి : ఇలాగే అందరిళ్ళల్లోనూ అందరు మగవాళ్ళకి చెప్పేస్తే 'ఇంతే మగవాళ్ళు' అనే గొడవ లేకుండా పోతుంది.

శాంతమ్మ : శుభం! మరి నే వెళ్ళొస్తా పిన్నిగారు నమస్కారం

[శాంతమ్మ కుడివైపు వెళ్తుండగా — తెర.]

**గమనిక :** ఈ నాటికను ప్రదర్శింప కోరువారు నాకు తెలియచేస్తే సంతోషిస్తాను.

— రచయిత

□□□